పవని
నిర్మలప్రభావతి



# ఒకే ప్రశ్న రెండు జవాబులు

"అమ్మా! నువ్వూ, నాన్నగారూ అంగీకరించకున్నా సరే, మేమందరం కలిసి, మీకు షష్టిపూర్తి మహోత్సవం చేసితీరుతాం!" అన్నారు ముక్త కంఠాలతో ప్రభాకర్, భాస్కర్, లలిత, సవిత!

"మిమ్మల్ని మేం సపోర్టు చేస్తున్నాం!" అన్నారు ప్రభాకర్ భార్య రోహిణి, భాస్కర్ భార్య రజని, లలిత భర్త శ్యాంప్రసాద్, సవిత భర్త రామ్మోహన్!

ప్రభాకర్, భాస్కర్‌లు మా కొడుకులు; లలిత, సవిత మా కూతుళ్ళు!

మరి యిద్దరు కొడుకులు, యిద్దరు కూతుళ్ళు, కోడళ్ళు, అల్లుళ్ళు అంత పట్టు దలగా, ముచ్చటపడి వేడుక జరిపిస్తా మనాలేగానీ, వద్దనే తల్లిదండ్రు లుంటారా ఎక్కడేనా? శ్రీవారూ, నేనూ సంతోషంగా అంగీకరించాం! పిల్లలందరి సంతోషానికి అవధుల్లేవు!

"అమ్మా! ఇక్కడ.... ఈ పల్లెటూళ్ళో ఆ ఉత్సాహం ఏమంత గొప్పగా వుండదు! హైద్రాబాదులో అయితే, ఎంతోమంది గొప్ప గొప్ప ఆహూతులు వస్తారు........ డబ్బు ఖర్చు అయినా చాలా సరదాగా.... గ్రాండ్‌గా వుంటుంది!" అన్నాడు ప్రభా కర్. ప్రభాకర్ అంబాలాలో ఆర్మీ డాక్ట రుగా పనిచేస్తున్నాడు. హోదా, సిరీ— సంపదా అన్నీ వున్నాయి! హైద్రాబాదులో ఈ మధ్యే పెద్ద బంగళా కొన్నాడు.

"అసలు అన్నయ్య ఆలోచనలో మరో కిటుకుంది అమ్మా!" అన్నాడు భాస్కర్ నవ్వుతూ, ప్రభాకర్ వేపు చూస్తూ.

"ఏమిటో చెప్పవోయ్ మరదీ!" అంది రోహిణి.

"ఈ సాకుతో—ఎక్కువ పలుకుబడి గల పెద్దల్ని పరిచయం చేసుకోవా లనీ...."

"సర్లె! ఎలా అయినా అనుకోండి. అక్కడయితేనే వసతిగా వుంటుంది!" అన్నాడు ప్రభాకర్. ముందు ఏర్పాట్లు చేయించడానికై పిల్లలందరూ నాలుగు రోజులు ముందుగానే వెళ్ళి పోయారు. రెండురోజుల తర్వాత నేనూ, శ్రీవారూ బయల్దేరాం! ట్రెయిన్‌లో ఫస్ట్‌క్లాస్ కంపార్ట్ మెంట్‌లో హాయిగా వుంది ప్రయాణం....మరో ఇద్దరు ప్రయాణీకులు తప్ప మరెవరూ లేరు!

వారు హాయిగా నిద్రపోతున్నారు. నాకు మాత్రం నిద్ర రావటంలేదు. నా హృదయం ఆనందంతో, గర్వంతో, తృప్తితో నిండివుందీ క్షణంలో.

నలుగురు బిడ్డల తల్లిని! అందరికి అందరూ ఉన్నతవిద్యలూ, సిరిసంపద లతో హాయిగా బ్రతుకుతున్నారు! అంతే కాదు, చాలా కుటుంబాలలో అల్లుళ్ళూ, కూతుళ్ళూ కీచులాడు కుంటూండటం చూశాను. అత్తింటి వేపువారికీ, అల్లు ళ్ళకూ ఉప్పూ, నిప్పూలా వుండటమూ నాకు తెలుసు! మరికొన్ని కుటుంబాలలో కొడుకులూ, తల్లిదండ్రులూ ఆగర్భశత్రు వుల్లా పోట్లాడుకోవటమూ, ముఖాలు చూచుకోకుండా వుండటమూ నాకు తెలుసు! అత్తగార్లనీ, మామగార్లనీ పురు గుల్నిలా విదిల్చివేసే కోడళ్ళూ నాక్కని పించారు! తల్లిదండ్రుల పరువు బుగ్గిచేసి స్వైరవిహారం చేసే కూతుళ్ళను చూశా న్నేను!

కానీ నా బిడ్డలు మాత్రం....పైవారంద రిలాకాక, సంస్కారమూ, సహృదయత,

నాగరికతలు సమపాళ్ళుగా జీర్ణించుకున్న వారు! వారికి జీవితసహచరులుగా వచ్చిన వారు కూడా అలాటివారే! దూరదూర ప్రాంతాల్లో ఉద్యోగరీత్యా వున్నవారంతా ప్రతి ఏడాదీ మా దగ్గిరకు వచ్చి మా యిద్దరికీ స్వర్గం యిక్కడే వుందని నిరూపించి మరీ వెడతారు! ఇంతకంటే మా క్కావలసినదేమిటి!

ఈనాడు—జరగబోతున్న ఈ షష్టిపూర్తి—మా దంపతుల బంగారు కలల పరమావధి!

"వేడివేడి శనక్కాయలు....శనక్కాయల్!" ఖంగుమంటున్న గొంతులో ఆలోచనలు ఎగిరిపోయాయి! శ్రీవారు కూడా అప్పుడే నిద్రలేచారల్లే వుంది. శాలువా దగ్గరగా లాక్కుంటూ కూర్చున్నారు.

ఆ శనక్కాయలమ్మే కుర్రాడు మా బెర్త్ దగ్గర్నుంచి కదల్లేదు. మా కేసే చూస్తున్నాడు. శ్రీవారు వాడి వేపు చూచి నవ్వారు. "వద్దురా బాబూ! చాలావరకు పళ్ళూడిపోయాయి మా యిద్దరికీ! నమల్లేము!"

కానీ ఆ కుర్రాడు కదల్లేదు...."బాబుగారూ! తవరు....తవఁరు....వేణుగోపాలరావు కదండీ? అమ్మగోరూ.........తవరు రాధమ్మగోరు కదండీ!" అన్నాడు శనక్కాయలబుట్ట బెర్త్‌మీద పెట్టుకుని—మా ఎదురుగా కూర్చుంటూ!

వారితోబాటు నేనూ ఆశ్చర్యపోయాను....

"ఇంకా నన్ను గుర్తుపట్టలేదాండీ! నేనేనండీ రాముల్ని! మీ శేషు తమ్ముణ్ణి!"

ఒక్కసారిగా మెరుపు కొట్టినట్లైంది నాకు. శేషు! శేషు గుర్తుకువచ్చింది.

"ఓహో! నువ్వటార్రా రాములూ! అప్పుడు బాగా చిన్నవాడివి. ఇప్పు డెదిగిపోయావు. పైగా నాకు చూపు సరిగా ఆనదు....గుర్తించలేక పోయాను. సర్లె! ఇంతకూ శేషు ఎక్కడుంది?" శ్రీవారి ప్రశ్న.

"ఇంకెక్కడి శేషు బాబూ! అది పాపం! తెగులుతో తీసుకుని తీసుకుని....ఆరేళ్ళు మంచంలోవుండి.....పదిరోజుల కిందటే చచ్చిపోయింది! పాపం! చచ్చేముందు కూడా మీ గురించి చెబుతానే వుణ్ణం దంటీ!"

"పాపం!" శ్రీవారి కళ్ళల్లో జాలి.... నాకు ఒళ్ళంతా ఏదో కోపం! మరేదో సంతోషం....

శేషు చచ్చింది! తెగుళ్ళతో తీసుక తీసుక చచ్చింది! కావల్సిందే! నేనన్నట్లే, నేనాశించినట్లే జరిగింది దానికి! విజయ గర్వంతో శ్రీవారికేసి చూశాను.........నా కళ్ళల్లోని భావం పసిగట్టారో ఏమో.... విరసనగా ముఖం చిట్లించుకున్నారు.

"అయితే......మీ అక్కను ఉద్ధరిస్తా నన్న ఆ మేనత్త కొడుకు ఏ మయ్యాడురా?" అక్కసుగా అడిగాను. రాములు నిర్లిప్తంగా నవ్వాడు."ఏ మేనత్తకొడుకు

ఉద్ధరిస్తాడమ్మగోరూ? చెడిందాన్ని? ఆ దెప్పుడో జారుకున్నాడు. ఎట్టాగో నేనే సాకాను...మా అమ్మ చచ్చి కూడా నాలు గేళ్ళు కావాత్తోంది.........తమ రెక్కడి కెల్తుండారండీ!'' గర్వంగా చెప్పాను. పక్కస్టేషన్ రాబోతూండగా రాములు, తన బుట్ట బుజానికి తగిలించుక లేవాడు శలవు తీసుకుంటూ. శ్రీవారు వాడి చేతిలో పదిరూపాలనోటు పెట్టారు. వాడు దిగి వెళ్ళిపోయాక—

''పాపం! ఇంకా 'శేషు' మీద జాలి కరిగిపోయినట్లుంది మీలో!'' అన్నాను హేళనగా!

నా వేపు క్షణకాలం చూశారు.... ''ఇంకా నీలో మానవత్వం చోటు చేసుకో లేదల్లే వుంది!'' అన్నారు మెల్లిగా! నాకు ఒక్కసారిగా కోపం ముంచుకువచ్చింది! ఎంతమాటన్నారు? శేషును పల్లెత్తుమాట అనకూడదు ఈయనగారిముందు!సుమారు ఇరవై సంవత్సరాల క్రితం శేషు విష యంలో ఇలాగే తీవ్రవాగ్బాణాలు విసురు కున్నాం! ఆనాటి కీనాడు మళ్ళీ ''శేషు'' (చచ్చిపోయినా!) కారణంగా మాటల ఈటెలు విసురుకున్నాం!

శ్రీవారు శాలువా కప్పుకుని మళ్ళీ పడుకున్నారు. నాకు నిద్రరావటం లేదు. శేషు చుట్టూరానే ఆలోచనలు పరిభ్రమింప సాగాయి....అవి నన్ను పట్టు బలవం తంగా గతంలోకి నెట్టుకు వెళ్ళాయి.

* * *

పెళ్లైన ఆరేళ్ళ తర్వాత కూడా—నా జీవితంలో ఏలాటి విసుగూ, నిరాశా చోటుచేసుకోలేదంటే, నేనెంత అదృష్ట వంతురాలినో-అని నేనే మురిసిపోతాను!

కారణం అత్తమామలు, ఆడబడుచుల అదుపూ, ఆజ్ఞలు లేని కాపురం. గృహ సీమకు నేను రాణిని.....నాకు శ్రీవారు సర్వస్వం!

గృహకృత్యాలకూ, గృహసీమకూ సంబంధించినంతవరకూ శ్రీవారు ఏలాటి జోక్యమూ కల్పించుకోరు.జమ ఖర్చులూ, పెట్టుపోతలూ—సర్వంనావే! ఇక ఇంత కంటే ఏం కావాలి స్త్రీకి! అలాగే శ్రీవారి ఆఫీసు విషయాల్లో, బయటి విషయాల్లో నేనూ తల దూర్చను! అంతకంటే 'రిలీఫ్' మగాడికేముంటుంది!

వచ్చిన చిక్కల్లా పనిమనుషులతో నే! ఈ విషయంలో నాకు చాలా నిక్కచ్చి అయిన అభిప్రాయాలున్నాయి! చక్కగా నేను చెప్పిన అన్ని పనులూ 'నీట్'గా చేయాలి.....గొణక్కూడదు.....యెదురు చెప్పకూడదు...పొరబాట్లు చేయకూడదు.

అన్ని నిబంధనలలో ఏ ఒక్కటీ నేను నడిలించుకోలేక పోవటంవల్లనే నేమో... ఏ ఒక్క పనిమనిషీ పట్టుమని పదిరోజు లుండలేదు నా దగ్గర........ఒక్కసారి కాబోలు ఒకర్తె నెలరోజులు వుంది. 'రికార్డుబ్రేక్ చేసిందోయ్!'' అని అన్నారు శ్రీవారు ముప్పైయ్యో రోజు! ఆ మరు నాడే అదీ చాలించుకుంది! ఇక ఆ తర్వాత



నెలకు యిరవై రోజులూ నేనే పనిమనిషి అవతారం దాల్చాల్సివుండేది!

"పనిమనిషిని వుంచుకున్నా, తీసేసినా నీ పెత్తనమే—అది నీ రాజ్యం కొబట్టి నేను జోక్యం కల్పించుకోను!" అని శ్రీవారు ఒక్క బొల్చి నీళ్ళు కూడా తోడే వారు కారు.

ఆ రోజు...."అమ్మగోరూ...కాసిన్ని బిచ్చం వెయ్యండమ్మగోరూ!"

వరండాలోనుంచి కంచుగంటలా విని పించిన కేకతో, అసలే అంట్లు తోముతూ ఆయాసపడిపోతున్న నేను "ఓ పిడికెడు భిక్షం దానికి మీరు వెయ్యకూడదా!" అంటూ వరండాలోకి వచ్చాను చేతులు కొంగుకు తుడుచుకుంటూ! మరుక్షణం 'షాక్' తిన్నట్లయ్యాను. పద్దెనిమిదేళ్లుండ గల అమ్మాయి....నిండు యౌవనంతో మిసమిసలాడ్తున్న నల్లని శరీరంతో.... మూడు గజాల చాలీచాలని బట్ట, చిరుగు లలో—శరీరాన్ని దాచుకోవాలనే ప్రయ త్నంతో సతమత మైపోతోంది. పేపరు చాటు చేసుక శ్రీవారు హైరానపడిపోతు న్నారు ('జాలితో-బాధతో'-అని తర్వాత నాతో అన్నారు!)

"రాధా! ఓ పాతచీరె ఇవ్వు...క్విక్!" అన్నారు మెల్లిగా ఇంగ్లీషులో. అప్పటికి పరిస్థితి పూర్తిగా బోధపడింది. ఆ సరికే- అటు పూర్తిగా టౌనూ, ఇటు పూర్తిగా పల్లెటూరు కాని ఆ వూరిలోని—కొత్తగా పెట్టిన హైస్కూలు తాలూకు కుర్రాళ్ళు కొందరు-ఎదురింటి మేడమీది నుంచి ఆ అమ్మాయి అణువణువూ పరిశీలిస్తూ,

వ్యాఖ్యలు-నవ్వులూ, కేరింతలు ఈలలు రూపంలో బట్వాడా చేస్తున్నారు.

"త్వరగా ఇలారా!" అన్నాను.

ఆ అమ్మాయి వచ్చింది. లోపలికివెళ్ళి, ఓ నడిపాతచీరె, జాకెట్టు తెచ్చి దాని ముఖాన గిరాటు వేశాను.'త్వరగా కట్టుకో అవి. అయినా ఇంత సిగ్గులేకుండా వచ్చా వేమిటి?' అన్నాను కోపంగా. 'ఏం చెయ్య నమ్మగోరూ? గుడ్డల్లేవు!' అంటూ నణి గింది. 'ఇలా అడుక్కు-తినకుంటే ఎద్దల్లే వున్నావు. పనిపాట్లు చేసుకోలేవూ?' అది నా రెండో ప్రశ్న.

"పనిత్తే చేత్తా నమ్మగోరూ!" విన యంగా అంది.

"మరి నీ కెవరున్నారు?"

"నా మొగుడు నన్నొగ్గేసిండమ్మ గోరూ! అడికీ, నాకూ నా చిన్నతనంలో పెళ్ళయిందట! మా అమ్మ, తమ్ముడు వున్నారు. తమ్ముడు కూడా ఇట్టాగే అడుక్కు-తింటున్నాడు!"

"అఘోరించలేకపోయాడు! అడుక్కు-తినటం ఓ పెద్ద వుద్యోగంలావుంది మీ ప్రాణానికి! సర్లె, రేపట్నుంచి నా దగ్గర పనిచెయ్యి. జీతమిస్తాను. అన్నం పెడ తాను! మీ తమ్ముడికి కూడా ఏదైనా పని నేర్పు...."

"ఓ!" సంతోషంగా అంగీకరించింది.

అలా 'శేషు' పనిమనిషిగా ప్రవేశిం చింది. అది వచ్చిన మరుక్షణం నుంచీ నాకు అదనంగా మరో రెండు కళ్ళు పుట్టుకువచ్చాయి! వాటిలో ఒకటి హమేషా శేషు వెనకాలే పరుగులు తీసేది. మరోటి శ్రీవారి మీదకు మళ్ళేది.

అలమారులో పెట్టిన చిల్లర డబ్బులు శేషుతీసి బొడ్డున దోపుకోవటం లేదుకదా? కొబ్బరినూనె సీసాలోనుంచి, నూనె వంపుకోవటం లేదుకదా? నా హేర్‌పిన్స్ ముట్టుకోవటం లేదుకదా? ఇలా పరిశీలించ టమే నా మూడోకన్ను కార్యక్రమం.

ఇక నాలుగో కన్నుకు మరీ బ్రిస్క్-ప్రోగ్రాం! శ్రీవారు దానివేపు (శేషువేపు!) దొంగచూపులు చూడటం లేదు కదా? విన్నను ఈయనగారు దానికి తలనూనె కొనుక్కో-మనీ, సబ్బు కొనుక్కో-మనీ, ఓ రూపాయి యిచ్చారుట (ఆ సంగతి శేషే నాతో చెప్పింది. "నీ తలమీదికి నూనె ఎలా వచ్చిందీ?" అన్న నా మూడో కన్ను ప్రశ్నకు సమాధానంగా!)-మరి ఆ రూపాయి యివ్వటంలో దాన్ని పరి శుభ్రంగా వుండాలని శాసించటంలో ఆయనగారిలో 'స్వార్థం' ఏమీ లేదు కదా? బాత్‌రూం కిటికీలోంచి, పెరట్లో జామి చెట్టుక్రింద అంట్లు తోముతున్న 'శేషు'తో 'కళ్ళ' కబుర్లు చెప్పటంలేదు కదా? (ఛీ-ఛీ, ఆయనలాటి వారు కారు. సంస్కార హృదయులు. ఏకపత్నీవ్రతులు....." అంటూ అడపా తడపా మనస్సు చీవాట్లు వేసినా—నాలుగోకన్ను బొత్తిగా ఖాతరు చెయ్య దలాటి మాటల్ని!)

"శుభ్రంగా తల దువ్వుకోవటం, వంటి

విండా బట్ట, కడుపునిండా తిండి అమర ఉంతో-నీ శేషు పోతపోసిన గ్రీక్ శిల్పంలా వుందోయ్ రాధా!" అంటూన్న వారి మాట లలో అంతరార్థం-ఆశ.ఏవేనావున్నాయా? ఇలాటి సవాలక్ష విషయాలు శోధించ టంతో క్షణం తీరిక దొరకటం లే దానాలుగోకన్నుకు!

షుమారు రెండు నెలల తర్వాత— పై రెండు కళ్ళూ అలసిపోయాయి. వాటి అవిరామ పరిశోధనలో — సత్ఫలితాలూ, అవి ఆశించిన సంఘటనలూ ఏవీ దొరక లేదు! దాంతో అసలు కళ్ళకు ఎక్కడలేని పౌరుషమూ వచ్చి, అదనపు కళ్ళను రెంటినీ పొడిచి పొడిచి పారేశాయి!

శేషు మెరికలా తేలింది. ఇంటి పను లన్నీ నిముషాలమీద చేస్తుంది! వంటపనికి కూరలు తరిగిస్తోంది. మసాలాలూ, పచ్చళ్ళు నూరి ఇస్తుంది. దాని తమ్ముడు రాములు కూడా దానికి సాయంగా పన్లు చేస్తున్నాడు. శ్రీవారికి బజారు పని తప్పింది. శేషు వచ్చాక నాకు పని మనుష లను మార్చే అవకాశమూ, పనిమనిషి అవతారమూ మరి వచ్చేందుకు ఆస్కారం లేకుండా పోయింది! ఒక్క మాటలో చెప్పాలంటే శేషులేకుంటే మేమెలా బ్రత గ్గలం? అన్న స్థితికి వచ్చేశాం! దాని శాక్తస్త జలుబు చేస్తే చాలు—రెండు టాబ్లెట్స్ — ఓ కప్పు కాఫీ నేనే స్వయంగా ఇచ్చేస్తాను! (కారణం రేపొ ద్దున అది పడుకుంటే, నా సద్దీ విరిగి పోతుంది, చాకిరీ చేసుకోలేక. అన్న స్వార్థం నా అంతరాంతరాలలో వుంది.

శేషు అప్పుడప్పుడూ చెప్పే కబుర్లను బట్టి-దానికి చిన్నతనంలోనే 'వెంకడు' కిచ్చి పెళ్ళిచేసింది వాళ్ళమ్మ. వెంకడు బెంగుళూరులో మిలిట్రీ శిక్షణ కేంద్రంలో స్వీపరుగా పనిచేస్తున్నాడుట! అక్క డెవరో ఒక తైను చేరదీశాడుట. అంచేత దీన్ని పిల్చుకుపోలేదుట! ఇవన్నీ శేషు చెప్పింది.

"పాపం! నీ బ్రతుకెల్లా అయ్యిందే శేషూ! పోనీ వా డెప్పుడో ఓనాడు తిరిగి రాకపోడు! అందాకా కష్టాలు ఓర్చుకో! వాడొచ్చాక—హాయిగా చిలకా గోరిం కల్లా వుందురు గానీ!" అన్నాను ఓదార్చుతూ.

"ఆడితో నేను బెంగుళూరెల్లనండమ్మ గోరూ!" అంది శేషు భయంగా నా వేపు చూస్తూ.

"ఎందుకని?"

"కొట్టి చంపుతాడేమోనని భయం!" అంది తలొంచుకుని. నాకు జాలేసింది. "పోన్లే ఇక్కడే వుందురుగానీ ఇద్దరూ. ఎలాగూ మీ అయ్యగారు పెద్ద ఆఫీస రయ్యారు. నౌకరుగా వాణ్ణివేసుకుంటారు. నువ్వూ వాడూ మా యింటి దగ్గరే పడుం దురుగానీ!" అన్నాను. నిజానికి పిల్లలు పుట్టాక, వాళ్ళ సంరక్షణ చూసుకోవడం నాకు తలకుమించిన పని అవుతోంది. హాయిగా శేషు పిల్లలకు స్నానాలూ—

బట్టలూ— పాలు కలిపివ్వడాలూ అన్నీ చూసుకొంటోంది. శేషు-వెంకడూ ఇద్దరూ ఉంటే నా పని హాయిగా వుంటుంది!

ఇలా నేను శేషు భవిష్యత్తును నిర్ణయిస్తూండగానే ఓ చిన్న సంఘటన జరిగింది. ఆ రోజు వుదయం ఎంచేతో కాస్త పెందరాళే నిద్ర మెళకువ వచ్చింది (శేషు వచ్చాక ఉదయం ఏడుదాటాకే నిద్రలేస్తున్నాను రోజూ!) పెరట్లోకి వెళ్ళాను. ఆ సరికే శేషు బాయిలర్‌లో నీళ్ళుపోసి, స్టవ్ మీద పాలు కాచుతోంది.... పెరట్లో గోడ అవతల ఎవరో యువకుడు నిల్చుని-సన్నగా "శేషూ!" అంటూ పిలిచాడు. ఇది మంత్రముగ్ధలా పెరటి గోడ దగ్గరికి వెళ్ళింది! ఇద్దరికిద్దరూ నన్ను గమనించ లేదు. గుసగుసలుగా కబుర్లు చెప్పుకుంటున్నారు! నవ్వుకుంటున్నారు.

కాస్సేపీ వరస చూచి — శేషును పిలిచాను. కంగారుగా వచ్చింది. "వాడెవడు? నీ మొగుడు గాని వచ్చాడా?" అన్నాను.

"కాదమ్మగారూ! మా మేనత్త కొడుకు!"

"రోజూ వస్తుంటాడా?" అనుమానంగా చూస్తూ అడిగాను. "ఊహూం! ఇయ్యాలే వచ్చాడు." అంది.

ఎంచేతో 'శేషు' వాలకం కనిపెట్టాలనిపించింది నాకు. పూర్తిగా పోని మూడో కన్ను నా ప్రయత్నానికి తన హర్షం వెలిబుచ్చింది!

మర్నాడు సినిమా హాల్లోంచి బయటికి వస్తూ—నేలవేపు ఎక్జిట్ నుంచి వస్తున్న శేషు-దాని మరో మేనత్త కొడుకునూ గుర్తించింది నా మూడో కన్ను.

ఇలా శేషు 'బావ'ల సంఖ్య ఎక్కువగానే ఉందని తెలిసిపోయింది!

చూచి చూచి ఓ రోజున కేక వేశాను దాన్ని. "నీ వరసేం బాగా లేదు. చెట్టంత మొగుడు బతికుండగా—వాడి కళ్ళుకప్పి, ఇలా తిరుగుతావా? ప్రతి 'బావ' తోనూ నీకు మాటలేమిటి?" అంటూ కేకలేస్తున్న నా ప్రశ్న పరంపర పూర్తి కాకుండానే శ్రీవారు నన్ను పిలిచారు. గదిలోకి వెళ్ళగానే "ఏమిటా అర్థంలేని కేకలూ? నీ ఈ 'బావ'తో నీకేం పనో, దానికీ దాని బావలతో అదే పని!" అన్నారు కొంటెగా నవ్వుతూ! మరో సమయంలో అయితే ఆ జోక్ ఎంజాయ్ చేసేదాన్నేమో కానీ, ఈ క్షణంలో వళ్ళు మండుకొచ్చింది. "నాకూ, దానికీ ఏమిటి సామ్యం?" అన్నాను మండిపడుతూ.

"ఏం? ఎందుకు లేదు? దానిలోనూ వయసుంది. మనసుంది. కోరిక లున్నాయి. తీర్చుకొనే దారి దొరికింది...."

శ్రీవారి మాటలకు అడ్డొస్తూ అరిచాను. "బావుంది. మొగుడు బ్రతికే ఉన్నాడు దానికి. వాణ్ణి వంచించి .... ఇదిలా...." శ్రీవారు ఇల్లెగిరి పోయేటట్లు నవ్వారు. "వాడిని ఇది వంచించే దేమిటి మధ్యలో? వాడు దీన్నే నమ్ముకుని వుంటేగా వంచన

వుండేడ్చిందా? మన కెందుకు వాళ్ళ వూసు?''

శ్రీవారలా ఎదురువాదం వేసుకొంటున్న కొద్దీ నాలో 'శేషు' ను సంస్కరించాలన్న పట్టుదల హెచ్చసాగింది. పది రోజులపాటు పతి భక్తిని గురించీ, అందులోగల ఇహమూ, పరమూ గురించీ పురాణ కథలు చెప్పాను శేషుకు.

భర్తకాక — ఇతర పురుషుల మీద మనసు నిలపడం, వారితో తిరగడం, నరకానికి యెలా దారి అవుతుందో లెక్చర్లిచ్చాను!

చివరకు అలాటి స్త్రీ బ్రతుకు యెంత దుర్భర వేదనలకు గురి అవుతుందో—ఆ స్త్రీకి సమాజంలో యెంతటి చెడ్డ పేరు ముద్రపడుతుందో, వర్ణించి వర్ణించి, తోమి వదిలిపెట్టాను.

భారతీయ సంస్కృతి సభ్యతల్ని కాపాడాల్సిన విధి ఈ దేశపు స్త్రీల మీద (నా దృష్టిలో ఈ క్షణం వున్నది శేషు ఒక్కటే!) ఎంతగా ఆధారపడి వుందో దాని బుర్ర పగిలిపోయేలా బోధించాను. శేషు అన్నీ విన్నది. ఓర్పుగా వూకొట్టింది. అవసరమైనచోట 'అవునమ్మగారూ. కాదు మరీ?' అని కూడా అంది!

కానీ మరునాడే మరో 'బావ' తో షికార్లు కొట్టింది (ట!)

ఈసారి కేకలేశాను. ''ఇలా అయితే ఇక నీలాటి అపవిత్రురాలికి నా యింట్లో స్థానం వుండదు పొ... మ్మన్నాను. శేషు తలూపిందేగాని దాని పద్ధతి మార్చుకోలేదు.

హఠాత్తుగా ఓ రోజు బెంగుళూర్ నుంచి వెంకడు వూడిపడ్డాడు. దాన్ని పిల్చుకువెడతానన్నాడు! కానీ శేషు నసేమిరా వెళ్ళనంది. కనీసం వాడు ఇక్కడే వున్నాడన్న భయమేనా లేకుండా, తన 'బావ' లతో కబుర్లు సాగించిందిట!

రెండు రోజుల తర్వాత వెంకడు నా దగ్గరకూ, శ్రీవారి దగ్గరకూ వచ్చాడు. ''మీరు నచ్చచెప్పి నా వెంట దాన్ని పంపండమ్మగారూ! లేదా ఈడే దాంతోపాటు పడుంటా! అట్లయినా దాన్ని ఒప్పించండి'' అన్నాడు.

శేషును పిలిచాను. వరండాలోకి వచ్చి ఓ వారగా నిల్చుంది. శ్రీవారు కాస్తా పేపర్లో ముఖం దాచేసుకున్నారు. ఈ మగాళ్ళ కిదో జబ్బు. ఏదేనా సీరియస్ సమస్యవస్తే చాలు, పేపర్ని డాలులా వుపయోగిస్తారు!

''శేషూ! వెంక దేమంటున్నాడో విన్నావా?'' అన్నాను యజమానురాలి హోదా కంఠంలో ఖంగుమనిపిస్తూ!

''ఆ! మా బాగా వింటున్నానమ్మగారూ! అదెవత్తో— వున్నవరకూ డబ్బు గుంజుకుని, వెగుళ్ల తగిలించి—పంపేసిందీణ్ణి! ఇప్పుడు నా మీద ప్రేమ పుట్టుకొచ్చింది!''

అంత నిక్కచ్చిగా అది చెప్పేసరికి

క్షణకాలం దిమ్మెరపోయాను నేను!లోలో పల ఆ కలవరపాటును అణిచేసుకుని తీక్ష ణంగా దానివేపు చూశాను. "ఛాల్లే— వెధవ కబుర్లూ నువ్వూ! వాడంత వాడొచ్చాడు నీ దగ్గరకు. ఇక వెధవ్వేషా లెయ్యక, వాడితో హాయిగా మా బోట్ హౌస్‌లో వుండు....ఇద్దరూ చిలకా...."

నామాట పూర్తికాకుండానే శేషు గట్టిగా అరిచింది. "అమ్మగారూ? మీరె న్నైనా చెప్పండి. ఇక ఆడితో కాపురం నేచెయ్యను!" నేను నిర్ఘాంత పోయాను. శేషు....! దీన్ని నేను చేరదీసాను! మని షిని చేశాను! మనుగడ కల్పించాను! చివ రకు నన్నే ఎదిరిస్తోంది! నా ఆజ్ఞ జవదాటు తోంది! నాలోని అహం కోడె త్రాచులా లేచి బుసలుకొట్ట నారంభించింది!

చివరిసారి అరిచాను. "అంతేనా నీ నిర్ణయం?"

"అంతే!"

నాకు శృంగభంగమైనట్లైంది! వెంక డితో గట్టిగా చెప్పాను."ఈ భ్రష్టతో నీకు పనేమిట్రా? నువ్వు హాయిగా మరో పెళ్ళిచేసుకో! ఇక చూడుకో.........దీని బతుకు.......కుక్కలు చింపిన విస్తరల్లే అవుతుంది...!"

వెంకడు వెళ్ళిపోయాడు. శేషూ వెళ్ళి పోయింది! శ్రీవారి వేపు చూశాను. నిశ్చ లంగా కూర్చుని వున్నారు ఏమీ జరగ నట్లే....

"విన్నారా అంతా!"

"ఆ!"

"రేపట్నుంచీ దాన్ని పనిలోంచి తీసే స్తాను!" కోపంగా అరిచాను.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? దాన్ని ఇంత దాన్ని చేసిన నా మాటే విననంతటి కొవ్వు పట్టింది దానికి!" నా మాటలకు అడ్డొస్తూ శ్రీవారు అరిచారు "స్టాప్. ఎంతదాన్ని చేశావ్?"

"మనిషిని చేశాను!"

"ఎందుకోసం చేశావు?"

జవాబుకోసం తడుముకున్నాను.

"నీకు పనిమనిషి కావాల్సి చేరదీశా - నమ్మకంగా వుంది కాబట్టి ఆదరించావు. నీవు ఇచ్చే జీతానికి పది రెట్లు చాకిరీ చేస్తోంది కాబట్టి అభిమానం చూపించావు. మరిందులో నీ ఉద్ధరింపేముంది?"

నాకు కోపం అవధులు దాటింది. "ఇలా దాన్ని మీరు వెనకేసుకు రావటం..."

"వెనకేసుకురావటంలేదు రాధా! కాస్త నింపాదిగా ఆలోచించు. దాని వ్యక్తిగత సమస్యలూ, సరదాలూ దానివి! అందులో నీ జోక్యం ఎందుకు? అసలలాటి విష యాల్లో తల దూర్చే హక్కు నీ కెక్క డుంది?"

"అలా అని నా ఇంట్లో ఓ అపవిత్రు రాలిని-ఓ భ్రష్టను తిరగనివ్వమంటారా?"

"ఈ లోకంలో ఎందరు అపవిత్రులు లేరు? ఎందరు భ్రష్టలూ- భ్రష్టులూ లేరు?

మరి ఈ ప్రపంచంలో నువ్వు బ్రతకటం లేదా?"

శ్రీవారి వాదన నాలోని కోపాన్ని మరింత రెచ్చగొట్టింది. "మీరు ఎన్నైనా చెప్పండి. దాన్ని పనిలోంచి తీసేస్తాను... తిక్క కుదిరించేస్తాను!"

శ్రీవారు పెద్దగా నవ్వారు. "దాని తిక్క కాదు కుదిరేది—మన తిక్క!" నాకు నిజంగా తిక్క రేగిందా మాటలతో!

శ్రీవారు శాంతంగా నా భుజం మీద చెయ్యివేసి అడిగారు. "కొన్ని ఇలాటి విష యాలు చూచీ చూడనట్లుండాలి రాధా!"

"............"

"పోనీ ఓ మాటడుగుతాను చెప్పు. నీ బిడ్డల్లో ఓ బిడ్డ ఇలా ప్రవర్తిస్తుం దనుకో...."

శ్రీవారి ప్రశ్న పూర్తి కాకుండానే ఛర్రుమన్నాను. "నరికిపారేస్తాను........ అంతే!" లోపలికి వెళ్ళిపోయాను.

ఏం దేశం గొడ్డుపోయిందా? ఇంతోటి పనిమనిషి నాకు దొరకదా? నా చేతినిండా డబ్బుంది! కావలసినంత పలుకుబడి ఉంది. ఒకరు కాదు, పది మంది నౌకర్లను పోషించే స్తోమతు వుంది! ఈ శేష బంగారు కత్తికాదు. దీన్ని మానిపించే స్తాను. అంతేకాదు, దీనికి మరెక్కడా పని దొరక్కుండా చూస్తాను. తోక కోసి సున్నం పెడతాను. మొలిచిన కొమ్ములు కత్తిరిస్తాను..............దృఢ నిశ్చయానికి వచ్చాను.

మరునాడే శేషను పనిలోనుంచి తీసే శాను. కొత్త పనిమనిషిని పిల్చుకున్నాను. ఆ రోజంతా శేష ఏడుస్తూనే నా చుట్టు తిరిగింది. నాకు దయ కలగలేదు.

"అమ్మగారూ! ఒక్క సంగతి.......... అదే, ఆడంటే నా కిష్టం లేదు—వది లెయ్యండి. నా జీతం తగ్గించినా సరే, మీ పాదాలదగ్గరే పడుంటా....!" అంటూ కాళ్ళా వేళ్ళా పడింది. నేను ససేమిరా బెట్టువదల్లేదు. ఏడుస్తూ చివరకు అది అంది "అమ్మగారూ! నేనేం తప్పుచేశానని తవరిలా నా నోటికాడి కూడు లాగె య్యటం?" నే ను ఇల్లెగిరిపోయేలా అరిచాను. "యింకా నీ తప్పేమిటో నే చెప్పనవసరంలేదు. కాలమే చెబుతుంది. నన్ను విసిగించక వెళ్ళు! మళ్ళీ నీ ముఖం నాకు చూపించకు!"

"అయ్యగారూ!" అంటూ శ్రీవారి గదిలోకి ఏడుస్తూవెళ్ళింది శేష.... వెనకాలే నేనూ వెళ్ళాను.

"రాధా! తొందరపడ్తున్నావు సుమా! క్షమించలేవూ?" అన్నట్లు చూశారు శ్రీ వారు నావేపు. నేనూ శ్రీవారికి కళ్ళతోనే జవాబిచ్చాను. "గృహపరిధికి సంబం ధించిన మైనర్ విషయాలలో మీ జోక్యం-అధికారం అనవసరం!"

శ్రీవారు పలక్కపోవడంతో శేష డీలా పడిపోయింది. ఏడుస్తుకుంటూ వెళ్ళి పోయింది.

మర్నాటినుంచే నేనే ఓపినంతవరకూ

'శేషు'ను గురించిన 'చెడు'ను గురించీ (ఆలిండియా రేడియోలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాల్లా) వివరంగా-విపులంగా, పసిపిల్లలక్కూడా అరటి పండు వలిచి చేతులో పెట్టినట్లు చెప్పాను। ఇన్నాళ్లూ నేను కాబట్టి దాన్ని భరాయించ గలిగాననీ - మా శ్రీవారులాటి ఏకపత్నీ వ్రతులు మాత్రమే దాని జాలంలోనుంచి తప్పించుకోగలరనీ.... ఎన్నో - మరెన్నో చెప్పాను। అది పరోక్షంగా విన్న శ్రీవారు కళ్ళలో రక్తంలాటి కోపం - లావాలాటి కోపం పెల్లుబకటమూ నాకు తెలుసు. ఓ రోజు "మరీ పశువ్వి కాకు।" అన్నారు - ఇంకా కోపం మింగుకోలేక।

ఓ రెండు నెలలు తిరక్కముందే, శేషు, దాని అమ్మ, తమ్ముడు ఎక్కడికో వెళ్ళిపోయారని తెలిసింది. అప్పుడప్పుడూ శేషు గుర్తుకు వచ్చినపుడల్లా శ్రీవారు భారంగా, జాలిగా నిట్టూర్చేవారు. నేను మాత్రం కసిదీరా...."దాని పొగరు అణిగి వుంటుంది. అది బ్రతకలేక ఛస్తూం టుంది।" అని మనసారా దీవించేదాన్ని.

తర్వాత-రోజులు నెలలు జరుగుతున్న కొద్దీ 'శేషు' జ్ఞాపకాలుకూడా నాలో పూర్తిగా మాసిపోయాయి. పిల్లలూ, వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ, డాబులూ, దర్జాలూ .. 'శేషు' లాటి కీటకాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరమూ నాకు కలగ లేదు।

ఆనాటి కీనాడు........శేషు తమ్ముడు రాములు కనిపించి శేషును గుర్తుకు తెచ్చాడు।

"స్టేషన్ వస్తోంది. లే।" అన్నారు శ్రీవారు. ఆలోచనలకు పుల్‌స్టాప్ పడింది.

స్టేషన్‌కు భాస్కర్ కారు తీసుక వచ్చాడు. బంగళాలో అడుగెట్టి—ఆ ఏర్పాట్లన్నీ చూచి నా హృదయం ఆనందం తోనూ, గర్వంతోనూ నిండిపోయింది.


* * *

ఆరోజు ఉదయంనుంచీ వూపిరి సలప నంతటి సందడి. ఆహూతులు వేల సంఖ్యలో వచ్చారు. షష్టిపూర్తి మహో త్సవం శాస్త్రయుక్తంగా జరిగింది। నేను, శ్రీవారు, నలుగురు పిల్లలూ, కోడళ్లూ, అల్లుళ్లూ-అందరం కలిసి గ్రూప్ ఫొటో తీయించుకున్నాం.

ముఖ్యులైన కొందర్ని మాకు పరి చయంచేశారు పిల్లలు. "వీరు మిసెస్ బెనర్జి। నగరంలో చాలామంది కోటీశ్వ రుల్లో వీరు ఒకరు।" ప్రభాకర్ పరిచయం చేశా డొకామెను. ఆవిడ దాటివెళ్ళాక.... నా చెవిలో చెప్పింది సవిత "అదో కార్నర్‌లో సోఫాలో కూర్చునివున్నతను మిసెస్ బెనర్జి మొదటి భర్త-రామదాస్।"

నేను ఆశ్చర్యంగా చూశాను సవిత వేపు.

"ఉష్। అలా వెర్రిమొగం వెయ్య కమ్మా। కొంపదీసి ఆవిణ్ణిమాట అడిగేవు సుమా। పరువుపోతుంది।" నా గొంతులో ఏదో అసహ్యం పేరుకుంది గళగలా-




మ్రింగలేనిది!

"ఈమె మిస్ తార! ప్రఖ్యాత సినీ తార!" భాస్కర్ మరొకామెను నాకు పరిచయం చేశాడు.

వుల్లిపొరల్లాంటి బట్టల్లోవున్న తార తమాషాగా నవ్వింది....భాస్కర్, ప్రభాకర్, రామ్మోహన్, శ్యాంప్రసాద్-తార అందాన్ని చూపులతో జుర్రేస్తున్నారు. ఆహూతులలో చాలామంది ఆమె సౌందర్యావలోకనంలో మైమరచి వున్నారు.

"ఛీ....ఛీ....ఇలాటివాళ్ళ నెందుకు పిలిచారే!" అన్నాను లలితతో విసుగ్గా-రహస్యంగా!

లలిత నావేపు గుర్రురిమి చూచింది. "ఛాల్లే అరవకు! వింటే మా ప్రాణం పోతుంది! రేపొద్దున నా కూతురికి ఆవిడ స్వంత పిక్చర్లో ఓ రోల్ ఇస్తానని మాటిచ్చింది కూడాను. నీ చాదస్తంతో మా భవిష్యత్తు చెడగొట్టకు!"

నా గుండెల్లో ఏదో వికారం—అణచుకోలేనిది....!

గొల్లున నవ్వులు వినిపించి తృళ్ళిపడి చూశాను. అక్కడో అమ్మాయి. అవివాహిత (మిస్ మోహిని, ఎం. ఏ. అట!) ఏదో ఛలోక్తులు విసురుతూ నవ్వుతోంది. ఆమె బుగ్గమీద చిటికె వేసి ఏదో కబురు చెబుతున్నాడు మరొకాయన .... శ్యాంప్రసాద్ ఆమె చెయ్యిపుచ్చుక నా దగ్గరకు

పిల్చుకువచ్చాడు....

"ఈమె మిస్ మోహిని, ఎం. ఏ. అత్తయ్యా! భలే చలాకీపిల్ల! పెళ్ళౌద్దం టోంది! కొంటెపిల్లా?" మళ్ళీ ఆమె చెవి సుతారంగా మెలిపెట్టాడు శ్యాం.

కడుపులోనూ తిప్పేస్తోంది .... ఏదో బాధ-చెప్పలేనిది!

సాయంత్రం అయ్యేసరికి దాదాపు అలసిపోయాను...శారీరకంగానే కాదు.... మానసికంగా కూడాను!

"అమ్మా! నువ్వూ, నాన్నగారూ పెందరాళే భోంచేసి పడుకోండి .... మా ఫ్రెండ్స్ మరికొందరొస్తారు. డిన్నర్ ఏర్పాటు చేయించాం! పొద్దుపోతుంది మాకు. అందాకా మీరు వెయిట్ చెయ్యట మెందుకు?" అన్నారు పిల్లలు!

నిజానికి నాకూ విశ్రాంతిగా పడుకోవా లనిపిస్తోంది. శ్రీవారు అలసటగా వున్నారు. ఇద్దరం భోంచేసి మేడమీద మాకై కేటా యించబడిన గదిలో పడుకున్నాం. మిసెస్ బెనర్జీ, ఆమె మొదటి భర్త....మిస్ తార....మిస్ మోహిని, ఎం.ఏ.....వాళ్ళ చుట్టూరా ప్రదక్షిణలు చేస్తూ—వారిని నెత్తికెక్కించుకు తిరుగుతున్న నా పిల్లలూ—కోడళ్ళు .... కొడుకులు .... మిగతా ఆహూతులు....ఏమిటో మన సంతా బేజారుగా వుంది. పదిగంటలు దాటుతోంది. క్రిందహాల్లోంచి నవ్వులూ... కేరింతలూ....పాత్రల చప్పుళ్ళూ....ఏదో ఇంగ్లీష్ మ్యూజిక్ వినపడ్తోంది....!

డిన్నర్ మొదలైంది కాబోలు! ఆ వేడుక చూద్దామనే కుతూహలం రేగింది నాలో... శ్రీవారిని తట్టి లేపాను. "అలా వెళ్ళి ఆ సరదా చూద్దామా?" అన్నాను.

"ఉదయంనుంచీ చూచిన సరదాల కంటే మరికాస్త పెద్ద మోతాదులో వుంటుందేమో ఇది....పద!" స్వగతంలా అనుకుంటూ నా వెంట వచ్చారు. గది బయటికి వచ్చి—రెయిలింగ్ దగ్గరకు వచ్చాము....

క్రింద హాల్లో కనిపించిన దృశ్యం...?


సవిత, లలిత, రోహిణి, రజని.... మరెవరో చాలామంది స్త్రీలూ, ప్రభాకర్, భాస్కర్ .... శ్యాం, రామ్మోహన్ .... ఇంకెవరెవరో పురుషులూ....

వావివరుసలు లేకుండా ఒకరి నడు ముల చుట్టూరా మరొకరు చేతులువేస్తూ.. నవ్వుతూ, నవ్విస్తూ, హత్తుకుంటూ, మోటుమాటలూ .... గ్లాసుల చప్పుళ్ళతో, హాలంతా ప్రతిధ్వనిస్తుంటే...పశువుల్లా... అనాగరికుల్లా....అసహ్యకరంగా....

నా కళ్ళు తిరుగుతున్నాయి. నా ఒళ్ళు తూలుతోంది. నే నేమైపోతున్నాను....? నా చుట్టూరా శ్రీవారి చేతులు అల్లుకోవడం మాత్రం నాకు తెలుసు....

కళ్ళు తెరచి చూశాను. నా మంచం చుట్టూరా నా కొడుకులూ, కూతుళ్లూ, మరి కొందరు ఆహూతులు గాభరాగా నిల్చుని నావేపే ఆత్రుతగా చూ స్తున్నారు.

"కంగారుపడకు....!" అంటున్న




ట్లున్నాయి వారి చూపులు. కానీ ఆ కళ్ళ లోతుల్లో "చూశావా? మరి నీ బిడ్డలూ - వారి చుట్టూరా వున్న నాగరిక సమాజం... ఎలావుందో వారందరినీ నువ్వు సంస్కరించగలవా?" అన్న ప్రశ్న దాగివున్నట్లు నా హృదయానికి ఏదో అనుభూతి.

శ్రీవారు అందర్నీ బయటికి పంపేశారు, నాకు విశ్రాంతి కావాలన్న మిషతో .... అందరూ వెళ్ళిపోయాక.... చాలా ఏళ్ళతర్వాత ...శ్రీవారి గుండెల్లో ముఖంపెట్టి ఏడ్చాను! నా అంతరాంతరాలలోనుంచి శేష కంఠం ప్రతిధ్వనిస్తోంది. "అమ్మగారూ! నేనేం తప్పు చేశాను? నా నోటికాడి కూడెందుకు తీస్తున్నారు?"

అవును.... శేషుచేసిన తప్పేమిటి?

"నీ బిడ్డలిలా ప్రవర్తిస్తే?" ఒకనాటి శ్రీవారి ప్రశ్న!

"నరికిపారేస్తాను...." నా జవాబు ఆనాడు ...

కానీ ఈనాడు?

నా బిడ్డలు .... వారి చుట్టూరా చాలా మంది అలాటి బిడ్డలూ....వారందర్నీ నేనేం చేయగలను? ఏమీ చెయ్యలేనా?

మళ్ళీ శేషు ప్రశ్న నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది. అదేప్రశ్న.... ఒకే ప్రశ్న.

కానీ దానికీనాడు జవాబులు రెండు!

రెండూ విభిన్నమైనవి!